క్లుప్తంగా

మాజీ వైస్ ఎంపీపీకి సన్మానం



మాజీ వైస్ ఎంపీపీ మానసను సన్మానిస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని చీమల్‌దరి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు, మాజీ వైస్ ఎంపీపీ మానసను గ్రామస్తులు సన్మానించారు. ఉ.11గంటలకు పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు, గ్రామ ప్రత్యేకాధికారి కాంతారావు, కార్యదర్శి యాదగిరిలు శాలువా కప్పి సత్కారించారు. గడిచిన ఐదు సంవత్సరాలు గ్రామ అభివృద్ధికి ఆమె పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. జాతీయస్థాయిలో పంచాయతీకి అవార్డు రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుగుణ, గ్రామస్తులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఎదుట మురుగు



అంగన్‌వాడీ ఎదుట నిల్వ ఉన్న మురుగు నీరు

దుద్యాల్ : అసలే వర్షాకాలం.. గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా లేకుంటే దోమలు ఏర్పడి సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ, మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మురుగు కాలువ నిండుకుని దుర్వాసన వెదజల్లుతోంది. అభం శుభం తెలియని వయస్సులో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం చాలా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగును తొలగించి చిన్నారులను వ్యాధులు బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంటురోగాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

కొడంగల్ : ప్రస్తుతం వర్షాకాలంలో అంటురోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్, మలేరియా సిబ్బంది, ఆశకార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా నివారణకు ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాం నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప పాల్గొన్నారు.

కొబ్బరిసాగు పనుల పరిశీలన



గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు


యాలాల: మండల పరిధిలోని అగ్గనూరు శివారులో ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న కొబ్బరి మొక్కల పెంపకం పనులను ఎంపీడీఓ పుష్పలీల గురువారం పరిశీలించారు. ఈ మేరకు గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు ఎకరాల్లో 320 మొక్కలను నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధి కూలీలచే చేపడుతున్నారు. మూడు అడుగుల లోతులో పిట్టింగ్, మొక్కలు నాటడానికి విడతల వారీగా కూలీలకు డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధి సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనార్దన్, ఈసీ శ్రావణ్‌కుమార్, టీఏ కంఠం, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఐటీఐ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

అనంతగిరి: ఐటీఐ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వికారాబాద్ ఐటీఐ ప్రిన్సిపల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9177954208లో సంప్రదించాలన్నారు.

రైతు భరోసా ఎవరికో?

- రైతుల్లో అపోహలు.. అనుమానాలు
- గ్రామాల్లో కరువైన అవగాహన
- రైతు భరోసా, రుణమాఫీపై ఆందోళన



రైతుభరోసా లోగో

దౌల్తాబాద్: ప్రభుత్వం అందించే రైతుభరోసా ఎవరికి? రుణమాఫీకి అర్హులెవరు? అనే దానిపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో రైతులు ఎక్కడున్నా వారికి రైతుబంధు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో వారు రైతుబంధుకు అర్హులమని నిశ్చితంగా ఉండేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుభరోసాకు అర్హులమా.. కాదా అనే అనుమానంతో పాటు ఎన్ని ఎకరాలకు రైతుభరోసా జమ చేస్తారనే అనుమానాలు వెంటాడుతున్నాయి. ఇప్పటిదాకా రైతుబంధు అనుభవిస్తున్న వారిలో నేటి దాకా భాగాలుగా విడిపోకుండా ఉన్నవారు.. ఉద్యోగులుగా ఉండి వ్యవసాయం చేస్తున్న వారికి ఇలాంటి అనుమానాలు వేధిస్తున్నాయి.

అనుమానాలు.. ఆందోళనలు..

రైతుభరోసా తీసుకుంటున్న వారిలో చాలా మంది సన్నకారు రైతులే ఉన్నప్పటికీ, ఉమ్మడి ఆస్తి కలిగిన రైతుల కుటుంబాలు చాలానే ఉన్నాయి. ధరణి వెబ్‌సైట్ రీత్యా, వారి పెద్దల భూములను పంచుకునే వీలులేని పలు కారణాల దృష్ట్యా చాలా మంది భూమిని ఉమ్మడిగా పెట్టుకుని వ్యవసాయం చేస్తున్నారు. కానీ, ప్రభుత్వం రైతు భరోసాలో మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పడంతో వారిలో ఆందోళన మొదలైంది. కుటుంబం ఉమ్మడిగా ఉండడంతో భూమి ఎక్కువ విస్తీర్ణంలో చూపుతుందని, భాగాలుగా విడిపోతే కుటుంబంలో అందరు సన్నకారు రైతులమే అవుతామని పంపకాలు చేసుకున్నారు. ప్రస్తుతం ఉన్న లెక్కల ఆధారంగా రైతుభరోసా వేస్తే తర్వాత పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో చాలా మంది గ్రామాల్లో వ్యవసాయం చేస్తూనే వ్యాపారాలు ప్రారంభించారు. వ్యాపారం పెరుగుతుండటం వల్ల రుణాలు తీసుకునేందుకు, ఐటీ రిటర్న్స్ తీసుకుని వ్యాపారం చేస్తున్నామని దానితో పాటు వ్యవసాయం కూడా చేస్తున్నామని చెబుతున్నారు. మరికొందరు గృహ నిర్మాణం కోసం ఐటీని చూపించేందుకు యత్నించినప్పటికీ రుణాలు తీసుకోకపోయినా రెండేళ్ల పాటు ఐటీ చెల్లింపులు చేసినట్లు పత్రాలు పొందారు. ఇలాంటి వారికి రైతుభరోసా వర్తిస్తుందా..లేదా ని..? సందిగ్ధంలో ఉన్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ఉండాలి. కారు ఉండకూడదు.. వంటి నిబంధనలు తెరపైకి రావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వ్యవసాయంతో పాటు కారు, జీపు లాంటి వాహనాలకు అద్దెకు నడుపుతున్న వారికి రుణమాఫీ వర్తించకపోతే ఎలా అనేది రైతుల వాదన. ఇలా రుణమాఫీ, రైతుభరోసా మార్గదర్శకాలు పూర్తిగా వెలువడకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి అవగాహన కల్పించకపోవడంతో రైతులు మరింత ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతుబంధు, రుణమాఫీలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



రైతుభరోసా, రుణమాఫీపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు పలు అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రుణమాఫీ వర్తించని సన్నకారు రైతులు ఉన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి మార్గదర్శకాలు ఉంటాయనే అంశాలను రైతులకు తెలపాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నందారం

ఆదేశాలు రాలేదు



రైతు భరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాగానే గ్రామాల్లో రైతులకు విధివిధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారి అనుమానాలు నివృత్తి చేస్తాం. ప్రస్తుతం రైతుల్లో నెలకొన్న సందిగ్ధతలపై అధికారులకు తెలియజేశాం.

–లావణ్య, మండల వ్యవసాయ అధికారి

విధులపై నిర్లక్ష్యం తగదు

తహసీల్దార్ మురళీధర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కుల్కచర్ల: విధులపై నిర్లక్ష్యం వహించొద్దని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని మధుశాన్వి బ్లీచింగ్ పౌడర్ నీటిలో కలుపుకొని తాగడంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఈ విషయమై గురువారం తహసీల్దార్ మురళీధర్ కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని, సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. హాస్టల్‌లో ఇబ్బందికరంగా ఉండే విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, స్థానిక నాయకులు రాఘవేందర్ గౌడ్, హన్మంతు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పూడూరు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని పూడూరు తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో 99 సర్వే నంబర్‌లో ఓ రైతుకు సంబంధించిన భూమిని ఆక్రమించారని ఫిర్యాదు రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూములు అమ్మడం కొనడం నేరమన్నారు. ఇరు వర్గాలను కార్యాలయానికి పిలిపించి భూమిని సర్వే చేయించి ఇస్తామని పేర్కొన్నారు. సర్వే నంబర్ 99లో రియల్ వ్యాపారులు నకిలీ పట్టా సర్టిఫికేట్లు సృష్టించి ఇతరులకు విక్రయిస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

సాగు భూములకు మాత్రమే పెట్టుబడి

- రైతు భరోసాపై అన్నదాతల అభిప్రాయం
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్

తాండూరు రూరల్: సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయపడ్డారు. గురువారం పట్టణంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రయ్య ఆధ్వర్యంలో రైతుల సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పొలాలకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఓపెన్ ప్లాట్లు, రిసార్ట్స్ , వ్యవసాయేతర భూములకు ఇవ్వొద్దని సూచించారు. అలాగే, 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయం అందజేయాలని చిన్న సన్నకారు రైతులు కోరారు. పెద్ద రైతులకు ఇవ్వొద్దని.. వారు ఆర్థికంగా ఉన్నవారేనని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: రవిగౌడ్

రైతుబంధు భరోసా పథకంపై రైతుల సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న రైతు, పెద్ద రైతు తేడా లేకుండా అందరి రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ రుద్రమూర్తి, ఏఓ రజిత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్లు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కమిటీ నియామకం

తాండూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ తాండూరు నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రమేష్ చంద్రపండిత్, సయ్యద్ జుల్ఫీకర్ హుస్సేన్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. లయన్స్‌క్లబ్ తాండూరు అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, కోఆర్డినేటర్‌గా బస్సప్ప, ఉపాధ్యక్షుడిగా మురళీమోహన్ మల్లేపల్లి మధుసూదన్, మహ్మద్ యూసూఫ్, కార్యదర్శిగా వీరప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా మల్లారెడ్డి, కోశాధికారిగా మహ్మద్ ఆసద్, అలీ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా శ్రీధర్, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్‌గా వరప్రసాద్ గనాతే, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా దమోదర్, క్లబ్ కోఆర్డినేటర్‌గా ఓం ప్రకాష్, క్లబ్ సర్వీస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనం

బొంరాస్‌పేట: గడిచిన ఐదేళ్ల పాటు ఆత్మీయ సేవలు అందించామని మండల ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల, జిల్లా పరిషత్, కోఆప్షన్ సభ్యులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, కోఆప్షన్ సభ్యులను సన్మానించారు. ఐదేళ్లుగా అందించిన సేవలకు సన్మానం చేసి గౌరవించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ అన్నారు. పార్టీలకతీతంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమీబాయి, జెడ్పీటీసీ అరుణదేశు, ఎంపీఓ మహేశ్‌కుమార్, ఏఈపీఆర్ సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

బోరు పనులు ప్రారంభం



బోరు పనులకు పూజలు చేస్తున్న నాయకులు

ధారూరు: మండలంలోని కేరెళ్లి గ్రామ ఎస్సీకాలనీలో గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బోరు వేయించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నా సక్రమంగా తాగునీటి సరఫరా లేకపోవడంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌లు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ వెంటనే బోరు వేయించేందుకు అంగీకరించడం, ఎంపీటీసీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలిసి గ్రామానికి వచ్చిన బోరు పనులు ప్రారంభించారు. దీంతో కాలనీ ప్రజలు స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

తాండూరు టౌన్ : ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నేడు (శుక్రవారం) చేపట్టనున్న వికారాబాద్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు, జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్‌లు కోరారు. గురువారం వారు తాండూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు దివ్యాంగులకు రూ. 6వేల పింఛన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, డబుల్ బెడ్ రూం ఇళ్లు అందజేయాలన్నారు. ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా త్రీవీలర్ బైక్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ముట్టడికి జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అసైన్డ్ భూములపై విచారణ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పూడూరు: ఆక్రమణకు గురవుతున్న అసైన్డ్ భూములపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎన్కేపల్లి గ్రామస్తులు గురువారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 99, 101లో గల 125 ఎకరాల విలువైన భూములను నకిలీ ఎక్స్ సర్వీస్‌మెన్‌ల సర్టిఫికెట్లు తయారు చేసుకుని రియల్ వ్యాపారులు విక్రయిస్తున్నారని తెలిపారు. పేదలకు చెందిన అసైన్డ్ భూములు సైతం వదలడం లేదని వాపోయారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్న భీమయ్య, చందర్, రాఘవేందర్, రవి, ఆంజనేయులు, నరేష్, గంగాధర్‌గౌడ్, కుర్వ నర్సింలు, శ్రీశైలం, అశోక్ ఉన్నారు.

అభివృద్ధి పథంలో కొడంగల్



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్: కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందారం గ్రామం నుంచి కుదురుమళ్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో బీటీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్ నాయకులు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, రాజు, రాజశేఖర్‌రెడ్డి , గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, గోవిందు తదితరులున్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మహాదేవుని ఆలయంలో గురువారం మాసశివరాత్రిని పురస్కరించుకొని ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉ.9గంటల నుంచి 12గంటల వరకు లింగాష్టక పారాయణం, శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర పంచామృతంతో అభిషేకం చేశారు. విశేష అలంకరణ, శివ అష్టోత్తర శతనామావళి, లింగాష్టకం, బిల్వాష్టకంలతో దూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఖడ్గాలు వేస్తూ దేవదేణ్ణి వేడుకున్నారు. మంగళహారతులు అందిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సేవాభావంతో పని చేయాలి



ఎంపీపీ, జెడ్పీటీసీలను సన్మానించిన అధికారులు

పూడూరు: ప్రజాప్రతినిధులు సేవాభావంతో పని చేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పూడూరు తహసీల్దార్ రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పదవీకాలం పూర్తయిన ఎంపీపీ, జెడ్పీటీసీ , ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయడం ప్రజాప్రతినిధులు అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రజలకు అధికారులకు అనుసంధానంగా ఉంటూ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత గొప్పదని అన్నారు. మాజీ ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు మండల అభివృద్ధిలో అధికారులు పూర్తి సహకారం అందించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, మాజీ జెడ్పీటీసీ మేఘమాల, మాజీ వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



తాండూరు టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు

తాండూరు టౌన్ : నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో కష్టపడి చదివి ర్యాంకు సాధించిన విద్యార్థులకు తీవ్ర మనస్తాపం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్, ప్రకాష్, నవీన్, శ్రీనివాస్, బన్ని, ఎన్ఎస్‌యూఐ నాయకులు సంతు, ప్రేమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో….

నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా డివిజన్ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రైవేటు, ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలను మూసివేయించారు.

ప్రైవేటు పాఠశాలల బంద్

ధారూరు: నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించాయి. ప్రభుత్వ పాఠశాలు యథావిధిగా కొనసాగాయి. మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తామని ఎన్ఎస్‌యూఐ నేతలు హెచ్చరించారు. విద్యార్థులు, విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని కోరారు.

అధ్వానంగా యాలాల రోడ్డు



ప్రమాదకరంగా మారిన రోడ్డు

యాలాల: మండలంలోని లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. సుమారు ఆరు కిలోమీటర్ల ఈ రోడ్డుకు గతంలో ప్యాచ్ వర్కులు చేపట్టేందుకు తవ్వి కంకర, డస్ట్ వేశారు. దానిపైన తారును వేసి పూర్తి చేయాల్సి ఉండగా, ఆ పనులను ఆపేశారు. దీంతో ప్యాచ్ వర్కుల కోసం తవ్విన గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విషయంలో అటు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగదీశ్వర్

కొడంగల్ : కొడంగల్‌లో చనిపోయిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలను మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పదో వార్డులో అనసూయ, 3వ వార్డులో నర్సిములు అనారోగ్యంతో చనిపోయారు. బాధిత కుటుంబ సభ్యులను జగదీశ్వర్‌రెడ్డి కలిసి సానుభూతి తెలిపారు.



తాండూరు టౌన్: దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



కొడంగల్ : నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దొడ్డి కొమురయ్యకు నివాళి

దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లతో పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు.



పరిగి: దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు